# మరక

**- చావా శివకోటి**

తెలతెలవారుతున్నది.

ఎర్ర ముద్ద భూమిపైకి ఎగపాకుతున్నది.

సింధూరపు ధూమం నేల నలుచెరగులా పర పంజుకుంటున్నది.

ఊరు మేలుకొంటున్నది.

అసలీ జీవజాలాన మనిషి నిజంగా ఓ వింతైన 'జీవి'.

నవ్వడం, ఏడ్వడం...

ఆనందించడం, దుఃఖపడడం...

భయపడడం, ధైర్యంగా తలపడడం...

పారిపోవడం, ఎదురు తిరగడం...

శృంగారం అవసరమనుకొనడం, దాన్ని అప్పుడప్పుడు రాక్షసంగా పొందడం ... (బలిమిన)

అలరించడం... ద్వేషించడం, ప్రేమించడం, కామించడం, ఈర్ష్యపడడం...

అంతా తనకే కావాలనుకొనడం, కానపుడు చతికిలపడడం...

నడవాలనుకొనడం, నడతన విముఖత చూపడం...

వైరాగ్యంలో కెళ్లడం, రాక్షసానందం కోసం ఎదురుచూడడం.

ఇలా చెపుతూ పోతే అనేకానేక కోణాలు...

భిన్నంగా, చిత్రంగా, లోకోత్తరంగా రెటమతంగా అచ్చెరువొందేలా.

అనిపిస్తయి, కనిపిస్తయి.

ఈ రకరకాల స్థితుల మధ్య, సన్నగా కదలక వున్న అనూహ్యమైన సర్దుబాటు గుణం...

ఇతన్ని మనిషిగా మిగిల్చే ప్రయత్నం చేస్తున్నదేమోననిపిస్తుంది.

✦ ✦ ✦

ఓ వ్యక్తి వున్నాడు- తల్లిని ఆరాధిస్తాడు.

ఇల్లాలిని కూడా... ప్రియురాలిగానే ప్రేమిస్తాడు.

పిల్లలని లాలిస్తాడు. పెద్దల్ని గౌరవిస్తాడు, పూజిస్తాడు.

తోటివారితో సాదరంగా ఉంటాడు.

పడని వారితో కక్షగా వ్యవహరిస్తాడు. ఎడంగా ఉంటాడు.

మిత్రుణ్ణి స్వాగతిస్తాడు. శత్రువుని తుదముట్టించ యత్నిస్తాడు.

తలచిన మంచిని సమాదరిస్తాడు. చెడుని తోసిరాజంటాడు.

విజ్ఞత ముందు తలవంచుతాడు.

అజ్ఞానాన్ని పారతోల ప్రయత్నిస్తాడు.

చీకటితో పోరాటం (తిమిరంతో సమరం - శ్రీ దాశరథి)

వెలుగు కోసం ఆగని వెంపర్లాట.

నాకు కొంచెం ఆసరా ఇవ్వు! బ్రతుకు సత్యం కోసం వెతుకుదాం అంటాడు.

తన స్వార్థం కోసం మొత్తం నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తాడు.

మనిషి చస్తాడు- పుట్టుకతోనే చావూ సహజం

కానీ, మనిషి వెతికిన సత్యాన్ని చావనివ్వరాదు. అది ముందు మనిషికి వెలుగునివ్వాలి.

✦ ✦ ✦

లోకం ఉంది- లోకావలోకనం కోసం మనిషి ఉన్నాడు గద.

వాడు అసాధ్యుడు పునః సృష్టి చేయగల మరలాంటివాడు.

వానికో బ్రతుకుంది. దానికి అనుభవముంది.

తదనుగుణంగా వచ్చిన బాటుంది.

ఈ బాట ఎవరిచ్చిందో కాదు, తన స్వార్జితం.

✦ ✦ ✦

కాముడు నడుస్తున్నాడు-

కాలిబాటన.

ఈ కాలిబాట ఎన్ని వంకర టింకర్లుగా ఉన్నా, ఎత్తు-పల్లాలున్నా, వాగువంకలున్నా అది తన ఊరు చేరుస్తది.

కాముడు ఇల్లొదిలి నాల్గు దినాలయింది.

చిన్నకొడుకును దొరోరికానుంచితే వాడు చెప్పక చెయ్యక పారిపోయాడు, అదీ ఓ పోరి నెగేసుకొని.

పోయి వారం దినాలాయె. జాడ తెలీకపాయె. దగ్గరున్న టౌనుకు గాని పోయుంటడని-

జాడ దొరికి వాన్నెతకబోయి నాల్గు దినాలాయె.

కాముడి వంటిన- చొక్కా లేదు. పైకండువా నెత్తిన ఉన్నది. కాళ్లకు చెప్పులు లేవు.

ఒల్లు ఉప్పురిసి ఉన్నది- మసక ముదిరినా కళ్లకు జోడు లేదు. వయసా డెబ్బై పైన.

నడుస్తూనే ఉన్నాడు. నడుస్తుంటే కాళ్ల కలక.

ఎక్కడ పడితే ఆడ కూకుంటే 'బాగు' అనిపిస్తున్నది.

మాసిన గడ్డం చీదర పెడుతున్నది.

అమ్మయ్య ఊరు దావుకొన్తున్నది అనుకొన్నాడు- దూరంగ కనిపిస్తున్న చింతలతోపు లీలగ కనపడగనే.

తన ఊరు

పుట్టి పెరిగిన ఊరు.

అమ్మ, అయ్య, తాతముత్తాతలు... వాళ్ల తాతలు నడచిన నేల.

తను ఇక్కడ బిల్లంగోటి ఆడిన- వాగుల్లో దుమికిన, వెన్నెల కుప్పలాడిన.

బ్రతికిన బ్రతుక్కి 'ఆసర' ఇచ్చిన మట్టి.

ఊర్ని ఎప్పుడు దాటాల్సొచ్చినా- ఊపిరి వంటిని వదిల్నట్టు

ఊళ్లోకొన్తుంటే ఊపిరి ఆనందంగా దారాళంగా ఆడినట్టు.

ఏమిటో- ఇది.

చానాసార్లు ఆగి అనుకొన్నడు- కాని అర్థంగాలె.

ఆ అనుభూతి మాత్రం వదలదు.

ఇప్పటికి బ్రతుకున ఎన్నిసార్లో? చింతాకంత తేడా రాదు.

ఊరు ముంధరి వాగు దాటాడు.

పోరడు కనపడకపాయె- అన్న బాధ ఉన్నా నడక ఆగలే.

ఆగితే ఊరికి చేరేదెట్టా!

అసలేదీ- ఎప్పుడూ, ఎందుకూ ఆగదు.

సూరీడు, చందమామ, గాలి, ఎండ...

ఒక్క నీరు మాత్రం అప్పుడప్పుడూ చమటుంచి పరీక్షిస్తుంటది.

ఊరు. ఊరొచ్చింది. అదేడికొన్తది. కాముడొచ్చిండు. ఊరి మొగిన సంగమ్మ ఎదురయింది.

ఆగింది. నీళ్ల కుండ నెత్తినుంది.

చానా ఆరాటంగా అడిగింది 'బావ కనపడ్డాడా తాతా' అని.

'ఇప్పటిదనక ఏంజేత్తున్నవే- పొయ్యిన పిల్లిని అదిలించలేదా!' అని నవ్విండు.

ఆ నవ్వున ఉసి లేదు, జీవం లేదు. సంగమ్మ అడిగిన దానికి సమాధానమూ కాదిది.

'అదేం లేదే, జొన్న గింజలు దొరికినయ్. కడుగు కానింత వంచి చల్ల చుక్క పోయించుకొచ్చిన' అని నడిచింది.

ఈ సంగమ్మ కాముడి తాతకు- మనుమరాలే. కుదురుగ ఉంటది- చిన్నోడికి సరిజోడి.

చిన్నగ ముడేయించి గుడిసెన జారబెడద మనుకున్నడు. సచ్చిందనిక గుట్టుగ గంజి నీళ్లోసి- సాకుతది.

'కుదార్తంగ బతకొచ్చు' ననుకున్నడు. వాడేమో కాని కులపు పోరిని ఎంటేసుకొని పోయె.

'ఇదేం చోద్దెం' అన్నట్టు ఊరంతా గుబ, గుబలాడె. సిగ్గు చితికె.

'ఏందిరా దేవుడా అని ఎంత మొరపెట్టుకొన్నా తీరు దొరకదాయె. దొర్రేమో కబురు మీద కబురెడతండె. ఆడికి పోను మొఖం చెల్లకుండె. వీడు దొరుకుతడేమోననుకొని ఎంత చూసినా జాడ కరువాయె' అనుకుంటుండగనే గుడిసొచ్చింది.

పెద్దోడున్న జాడలే. కోడలు కనపడ్డది. ఎదురొచ్చింది. తాగెటందుకు నీళ్లిచ్చింది.

మునలోని వాలకం చూసి సంగతి గమనించింది.

'మీ పెద్ద పోరడు దిబ్బకు పోయిండు. వస్తుండాల' అంది నీళ్లు తాగిన చెంబు అందుకుంటూ.

తలూపి చుట్టు గుడిసె అరుగు మీద చతికిల పడ్డడు. నీరసం జవజీవాల్ని కుంగదీసింది.

అరుగున వరిగాడు. కళ్లు మూతలు పడుతున్నాయి.

పోరడి కోసం 'యావ' చావక తోవయిపు చూస్తుండగనే కన్నుమలిగింది.

✦ ✦ ✦

'పోరడేడిరా? గొడ్లపాకన వనికి తిప్పలవుతుంటే, పూటకొకడ్ని నేనేడ చూసేదిరా?' అన్నడు దొర.

దొరవారి ముఖాన నవ్వుందో– కోపముందో ఇన్నేళ్లుగ వెట్టి చేస్తున్నా అంతుపట్టలే. ఇక పట్టదు.

'దొరకలే దొరా. కాళ్లరిగిందనుక దిరిగిన. చుట్టం మార్గం చూసిన. శోషొచ్చింది తప్ప వాని జాడ దొరకలే' అంటూ తలగుడ్డ తీసి చేతుల్లో ఉంచుకొని– మూడుసార్లు నేలకు తగిలేలా వంగి మొక్కేసిండు కాముడు.

'మరి నువు గినక వస్తవేంది' అన్నడు అదోలా చూస్తూ.

'ఇది జీతం జేసి మెప్పించే వయసా దొర నీ కాల్మొక్త'

'నువు చేయలేవు, వాడేమో దొరకడు. అయినా లొట్టిపిట్ట లాంటి దాన్ని లేపకపోయినాడు. ఇంకేం దొరుకుతడు. సాలు పూరాగ చేస్తడని అంగుష్టము అద్దితివి. ఇప్పుడు నాపనెట్లరా!' అని.

వాలు కుర్చీ నుంచి కూస్త కదలి, 'నా పైసలన్నీ గట్టు తంటాలు పడత' అన్నడు చూస్తూ.

ఇంతలో అప్పిరెడ్డి హడావుడిగా లోపలికొచ్చి, 'దండం దొర' అన్నడు బల్లకిందనున్న అరుగున చతికిలపడి.

ఎదురుగున్న కాముడ్ని చూచి కిసుక్కున నవ్వబోయి– ఆవుకుని, 'పోరడ్ని ఎతకబోయినవన్నరు. తెస్తివేంది' అన్నడు.

దించుకున్న తలను అడ్డంగ ఊపిండు కాముడు– 'ఈయనొకడు. దొర 'తాన' అనకముందే 'తందాన' అనెటందుకు.'

'అయితే పైకం తెచ్చినవేంది?' అన్నడు పొగాకు కాడ విప్పుతా.

'ఎండలు భగ్గుమంటున్నాయి. కాలంగాంది ఏడ తెద్దును' అంటుండగనే,

> # విరహ గీతం
>
> నీ జ్ఞాపకం
> ఒక్కొక్కప్పుడు
> నన్ను ఏకాకిని చేసి
> సమూహంలోకి విసిరేస్తుంది
> ఇంకొక్కప్పుడు
> సమూహంలో వున్నా
> ఒంటరిని చేసి వేధిస్తుంది
> ఎప్పుడూ...
> నన్ను తరిమి తరిమి
> పిచ్చివాణ్ణి చేస్తుంది.
>
> – పెరుగు రామకృష్ణ

'లవ్డీ కొడక– నాటకాలాడతందవు. రేపీపాటికి పైకం కట్టాల. లేకుంటే ఎవళ్లో ఒకళ్లు పనికెక్కాల. కూకుని ఏడుపు మొఖం పెట్టి నేల గీతలు గీస్తే పోతాదిర. చింతబరికలు ఇరుగుతయి. ఆc' అన్నడు గుడ్లను ఎర్రగజేసి.

కాముడు కదల్లా. దండం పెట్టిన చేతులట్టనే ఉన్నయి.

'అప్పిరెడ్డి ముందే జెప్పిన. అప్పుడు జీతము అప్పిరెడ్డే రాసిండు. రేపు పైకం తీసుకొచ్చి ఇచ్చిపో. నసపెట్టకు' అన్నడు.

'రెక్కల కట్టాన బతికేటోళ్లం. తమకు తెలియన్దేముందది. ఏడనో ఒకచోట ఎవరో ఒకరు పనికి కుదరనిది, పైకమెవరిస్తరు. పనికెక్కాలంటే కాలం కావాలి గద' అన్నడు.

'ఇగో, ఇక ఆపు. చెప్పెదేదేం లేదు. కోపమొస్తే నేనసలు మనిషినిగాను పో!'

'నీ బాంచన్ దొర. కాల్మొక్త. నేనేడికి పోను? నువ్వే కాయాల' అంటూ వెనక్కి జరిగి కళ్లు తుడుచుకుంటూ నడిచాడు.

కాముడు గది దాటినంక అప్పిరెడ్డి దొర దగ్గరకి జరిగి 'కాముని కోడలు తమ కంట్లోబడ్డదా?' అన్నడు.

'అంత సక్కగుంటదేంది?'

'బాకీ చెల్లేసుకోవచ్చు' అని అదోలా నవ్విండు

అప్పిరెడ్డి.

వాడి మాటల తీరే అంత.

దొర నోట నోరూరింది.

✦ ✦ ✦

వారం దినాలు గడచినయి.

'అప్పిరెడ్డీ, కాలం వూ చెడ్డగ మారుతుందేమయ్యా' అన్నడు.

దొర మాట కర్థం తెలీక అట్లనే చూసిండు.

'కాముడు ఊళ్లో ఉన్నట్టా' అన్నాడు కూర్చుంటూ.

అర్థమైంది అప్పిరెడ్డికి– 'తనన్న మాట దొరకి నాటిందన్నమాట' అనుకొని,

'వాడేడికి పోతడు. వంటింటి కుందేలు' అని, 'వాకబుజేస్త పైకము తేలేదు గద' అని తలూపిండు.

ఇంతలో ఏడనుంచి వచ్చిండో, కాముడు 'దొర నీ బాంచెన్ కాపాడాలి!' అనుకుంటూ వచ్చి కాళ్లపైన పడ్డడు.

'ఏందిరా, ఇప్పుడార వచ్చేది. ఏమైపోతివి. మళ్లీ అక్కరయి వచ్చినవా?' అన్నడు వాణ్ణి జూస్తూ.

'చిన్నోణ్ణి ఎతికేందుకు పెద్ద పోరణ్ణి టౌనుకు పంపిన. వాణ్ణి పోలీసులు పట్టుకొని ఠానాల ఏసిన్రు. తమ కాళ్ల తాన బతికినోళ్లం. వాడేం చేసిండని పట్టుకొన్నరో తెలీకపాయె. చెప్పేటోడు లేకపాయె' అని ఏడుస్తున్నడు.

'వాణ్నెందుకు లోన ఏసిన్రో మతలబు తెలిసికొని రావద్దురా. నాకాడ ఎట్ల తెలుత్తది' అని అప్పిరెడ్డేపు జూసిండు.

> ## పుష్కర స్నానం
>
> పుష్కర స్నానాలు
> అయిపోయాయి...
> పాప ప్రక్షాళనం
> జరిగిపోయింది...
> మళ్లీ పాపానికి
> ఒడిగట్టి
> కృష్ణా పుష్కర స్నానానికి
> తయారు కాక!
>
> – గుడిమెట్ల గోపాలకృష్ణ

చీమ కుట్టినట్టు లేదు దొరకి. పైగా బొద్దింక వంటి మీద కెక్కినట్టు చిరాకు.

'మాకెవలు చెప్తరు దొరా. గాసాయకు సూడ రానియ్యడం లేదు' అన్నడు ఏడుస్తూనే.

'ఏదైనా మతలబు తెలవాలి గద' అన్నడు నింపాదిగా.

'అట్లనె అట్లనె దొర తెల్సుకొస్త. పోత' అని వెనక్కి మళ్లిండు.

వయసయినోడు గనక తూలుతుండు. గుండె బరువెక్కింది గనక వంగిండు.

'ఇగో, కాముడూ' పిలిచిండు అప్పిరెడ్డి.

ఆగిండు– 'దొరా' అంటూ.

'గొడ్లపాక కాడ పనికి కూస్తి నీ కోడల్ని దోలు. ఈ పొద్దెవ్వడు దొరకలే' అన్నడు.

తలూపిండు, నడిచిండు కాముడు.

✦ ✦ ✦

'దొర. కురం గొల్లలం. పెంటలు బెట్ట జీవాలు తోలుకొచ్చినం. నిరుడు సగ మన మర్రి చేలో నెల ఉండి బెట్టినం' అని మొక్కేసిండు కొమరయ్య.

దొర వాలు కుర్చీ నుంచి కళ్లు తెరచి చూసిండు.

అప్పిరెడ్డి లోనికొచ్చి– 'అసలు సంగతేంది' అని అడిగిండు.

'నిన్న పొద్దుగల మందన రెండు జీవాలు కనపడలే' అన్నడు.

'ఎవరి మీదైనా అనుమానమున్నదా' అడిగిండు అప్పిరెడ్డి.

'పెద్ద దొరగద. ఊరుగద ఇది. చెప్తండ' అన్నడు వాడు.

'కనుక్కుంట, రేపు రా' అన్నడు.

దొరకి మొక్కేసి వెనక్కి మళ్లిండు కొమరయ్య.

గబగబ గది లోనకి పోయిండు అప్పిరెడ్డి.

వంటోణ్ణి పిలిచిండు– 'నిన్న ఏటి పోతు పోగులొచ్చినయిర' అని అడిగిండు.

తలూపిండు వాడు. 'నాకూ వచ్చిందిలే' అంటూ బయటకొచ్చిండు.

'ఇద్దరికి పోగులొచ్చినంక దొంగెట్ట దొరుకుతడు. చెప్పులరిగిందనుక తిరుగుడే తప్ప' అని నవ్వుకుండు వంటోడు.

'దొర, నీ బాంచెన్ కాల్మొక్త. దొంగతనం చేసిండంటన్నరు. తమ కాళ్లకాడ బతికెటోళ్లం. ఎన్నడన్న మావోనిపై ఆ 'మరక' ఉన్నదా? గుడ్డగాల్సి వానిపై వేసిన్రు' అని దొర కాళ్లు పట్టుకొని వలవల ఏడ్చిండు కాముడు.

కాళ్లు విదిలించుకొని 'ఏడిస్తె పనైతాదిర. పనయితదనుకుంటే ఏడుపేంది. ఏమైన జేస్తరు. గని' అని అప్పిరెడ్డి.

'కాముడు ఏంజేసిండు. నువ్వు వానెంటేసుకుబోయి పని చూసుకురా' అన్నడు మళ్లీ కాసేపు జూసి.

'కాముడూ, ఇక పో. అప్పిరెడ్డిని తోల్తన్న గద. పొద్దుట్నే వస్తడు' అంటూ లేచి గొడ్లపాకేపు నడిచిండు.

కాముని కోడలక్కడ పనిచేస్తున్నది. పొద్దుగాల్నె పనిలోకొచ్చింది.

✦ ✦ ✦

పొద్దు పొడవక ముందే కాముడు లేచి మొఖం పుల్ల పారేసి పుక్కిలిస్తూనె, 'ఇగో, నేబోతన్న' అన్నడు కోడలితో.

'నే పోను' అన్నది కోడలు.

'నీ పెనిమిటి కోసం పోతన్న నేను. నువ్వు పోవాల. వామ్మా, ఈ పొద్దు పో' అని గడప దాటిండు.

'ఇజ్జతున్న వాడెవడు అటు పోడు' అన్నది కళ్లు పైట చెంగుతో వత్తుకుంటూ.

'మొదట పెద్దోడు రావాలె. నే పోతా. నువ్వూ పో' అంటూ నడిచాడు.

✦ ✦ ✦

కామూడూ, పెద్దోడూ టౌను నుంచి బాటెమ్మటిబడి ఊరు చేరుకునేసరికి పొద్దు మసకబారింది.

'కూసిని నీళ్లియ్యవే, గొంతు తడారుతున్నది' అంటూ అరుగు మొగిన చతికిలపడ్డడు.

గుడిసెన అలికిడి కాలె.

'పెద్దోడా, నీవైనా ఇన్ని నీళ్లియ్యి. ఇది లేనట్టుంది' అన్నడు.

తలూపి గుడిసెన దూరి నీళ్లిచ్చిండు.

'ఏడికి పోయిందిదీ' అంటూ తోవన బడ్డడు.

అచ్చుమ్మ కట్టెలెత్తుకొని ఎదురువడ్డది. జాడ అడిగిండు.

'పుల్లలేర రాలేదురా, దొర పశువుల దొడ్డికాడ పనుండదని నిన్నగన చెప్పింది. ఈ పొద్దు కుక్కలు గుడిసె తడికె తాన మల్లాడుతుంటె గెదిమిన' అంది నవ్వి.

గబగబ దొరోరి గడీయేపు నడవబోయిండు.

'అరే ఆగు' అంది.

'దొర పొద్దుంగాల లేవలేదన్నరు. చితుకులేరబోయెప్పుడు రాత్రిది దిగలేదనుకున్నం'

'ఇప్పుడేమో, అసలే పోయిండంటన్నరు. ఇది పనికి బోయింది గద, ఆడగాని చిక్కుబడ్డదా ఏంది' అన్నది.

ఇక నడవలే, పెద్దోడు లగెత్తిండు. దొర గడి ముందు జనం పోగడి ఉన్నరు. వరండా చప్టా మీద దొరను పండబెట్టి ఉంచిన్రు. తలెనక దీపం అగరొత్తులు... తొందరగ చెడతదని మంచుగడ్డలు చుట్టూరా బెట్టినారు. తలాపిన కూకుని ముక్కు చీదుతూ ఏడ్చెనోళ్లు మాత్రం కనపడలా.

పెద్దోడు చూసిండు. పశువుల దొడ్డేపు నడిచిండు. ఆడ కనపడ్డదది బిక్కచచ్చి.

చిన్నాచితక నల్గురయిదుగురు పోరలు దాని చుట్టూర ఉన్నరు.

ఇంతలో దొర కొడుకు పట్నం నుంచి వచ్చిండు. కారు దిగిండు. దర్జాగా నడిచిండు.

జనం 'వచ్చిండు, వచ్చిండు' అనుకొన్నరు. దూరం దూరం జరిగిన్రు. హడావుడి పడ్డరు. తోవ తొలిగిన్రు.

వాడు సీదా దొర, తానకు పోయి వంగలేక వంగి వాని పాదాలకు దండమెట్టిండు. కళ్లు తుడుచుకున్నాడు. నోటికి, ముక్కుకి గుడ్డ పెట్టుకొంటూ దగ్గరోళ్లను అట్టట్ట జూచి గడీల జొరబడ్డడు.

పెద్దోడు పెళ్లాం దగ్గరకు పోయిండు. చెయ్యి పట్టుకున్నడు. ఉలిక్కిపడి చూసినాది చెయ్యట్టుకున్నోణ్ణి. పెద్దోడే. ఇదిలించుకోలే. వాడెంట మేకపిల్లలా నడిచింది. గుడిసె ముందాగారు.

'లోనకు పా' అన్నడు చెయ్యి వదలి.

'నే రాను' అంది.

'ఏం?'

'మైలపడ్డ, మైలపడ్డ...' అని నేలపైన చతికిలపడి ఏడ్వబట్టింది.

పెద్దోని వంట్లో నెత్తురు పలచగయింది.

తల తిరిగినట్టయి, అరుగున అయ్య పక్కన కూర్చున్నడు.

చూస్తున్నడు కాముడు.

'ఏమైంది పోరనికి?' అని లచ్చుక్క దగ్గరకు రాబట్టింది.

'ఆగు, నువ్వు రాకు' అని కాముడు లేసిండు.

పెద్దోన్ని అరుగుకాన కూకోపెట్టి కోడలు పిల్లతానకొచ్చి దాని నెత్తిన చేయేసి నిమిరిండు.

చల్లగ చూసిండు. 'నిబ్బరపడు బిడ్డా' అన్నడు.

పెద్దగ ఏడ్సింది కాలుకి చుట్టుకొని.

దగ్గరికి తీసికొని, 'బిడ్డా, నీ తప్పేముందది. నువ్వు పోనన్నావు. నేను పొమ్మన్న. కాని, కాని....' అని అదోలా నవ్వి-

'బిడ్డా, నువ్వు పోవడమే మంచిదయ్యిందే. కొద్దిగ మరక అంటినా, ఊరి పీడ విరగడయింది. ఇగో, వంటికి 'దాగ'యితే కడుక్కుంటాం. కాకి రెట్టేసినా అంతే. ఎంగిలయితే 'దేముడా' అని మొక్కేస్తాం'

'నువ్వు నా కోడలివి గాదె. బిడ్డల్ని కన్న పేగువు. వాడు జాగ్రత్త. లోనకి తీస్కపో. నేనున్నగద, నీకేంది.'

'ఆc ఆc' అంటూ నడిచిండు. నడక బరువుగ లేదు. భారం దిగినట్టు ఎంత తేలికగనో వుంది. నెల పొడుపు దూరాన నడుస్తా కనపడ్డది.

ఆ వెలుగు చాలు-

ఎంత దూరమైనా నడక సాగుతది.

✦ ✦ ✦

తమ 'సిరి'ని తామే సంపాదించామన్నది అబద్ధం.

ఆ అబద్ధాన్ని నిజం చేసేందుకు జరిపేదే యుద్ధం.

ఆ యుద్ధం ప్రజల హితవు కొరకని నమ్మించడం రాజకీయం. ☆

# మట్టిలోంచి పైకి లేచిన అక్షరం

చైతన్య భూమిలో మొలకెత్తి
మనిషిలో పెరిగే విత్తనమే
అక్షరం
మెదడులోకి ఆలోచనల శ్వాసలు పీల్చుకుని
ఆదిమ దశ నుండి ఆధునిక దశ దాకా
వెలుతురు మెట్లు నిర్మించుకుని
మానవుడి చేతిలో చరిత్ర కలమై వికసించిందే
అక్షరం
మనుషులందరికీ బతుకు తెరువు
నిఘంటువులో పదాల్ని ఏర్చికూర్చిందే అక్షరం
ఆ అక్షరాన్ని యిప్పుడు పరాయి వీధుల్లో
అమ్ముకోవడానికి
అంతులేని ధనం పోసి కొనుక్కుంటున్నాడు
రాజకీయపు ఒత్తిళ్లలో భావితరాల పెదవుల మీదికి
దొర్లిపోవడానికి కృత్రిమ నినాదాలు
వల్లిస్తున్నాను
మేథలోని పసిడితనం
మాయమైంది...
అనుభవాలకు వేడితనం వచ్చినట్లుంది...
ఇక్కడి అక్షరాన్ని
ఎక్కడి నీళ్లతోనో పెంచరాదు
ఇక్కటి మట్టిలోంచి పైకి లేచిన అక్షరమే
నన్ను నన్నుగా పెంచే దేశం అవుతుంది
నా దేశాన్ని నా దేశంగా నిలిపే శక్తి
అవుతుంది.

– పి. అనంతరావు 6